నిరుద్యోగులకు కుచ్చుటోపీ!

మరోసారి నిరుద్యోగుల ఆశలకు జెల్ల కొట్టిన కూటమి సర్కార్

- 2014–19లో మాదిరిగానే ఇప్పుడూ మాయ
- ఎన్నికలకు ముందు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని హామీ
- గద్దెనెక్కి 9 నెలలవుతున్నా భృతి ఊసెత్తని ప్రభుత్వం
- బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై యువత ఆగ్రహం



బేస్తవారిపేట:

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే వరకూ నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కూటమి నేతలు ఆ హామీకి మంగళం పాడారు. గద్దెనెక్కి తొమ్మిది నెలలు గడుస్తున్నా.. ఆ హామీ అమలుపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నిరుద్యోగులకు భృతి అందించే ప్రతిపాదనే ప్రభుత్వం వద్ద లేదని అసెంబ్లీ సమావేశాల సాక్షిగా ప్రభుత్వం రాతపూర్వకరంగా తేల్చి చెప్పేసింది. గిద్దలూరు నియోజకవర్గంలో దాదాపుగా 20 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. 2014లో చంద్రబాబు హామీలను నమ్మి మోసపోయినట్లు 2025లోనూ నిరుద్యోగులు మరోసారి మోసపోయారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఇంటికో ఉద్యోగం, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు.. ఐదేళ్లలో మొత్తంగా 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.3,000 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం చేశారు. 'సూపర్ సిక్స్' పథకాల్లో ప్రధానంగా చూపించారు. గడప గడపకు తిరిగి ఫాంప్లేట్లు పంచిపెట్టి నిరుద్యోగుల్లో విపరీతంగా ఆశలు పెంచారు. ఎన్నికల సమయంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ అనే నిబంధనలు ఏవీ చెప్పకుండా నిరుద్యోగ భృతి ఇస్తామనడంతో అంతా నమ్మారు. కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతిపై ఒక్కరూ నోరు మెదపడం లేదు. సూపర్‌సిక్స్ హామీల్లో ప్రధానమైన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిపై బడ్జెట్‌లో సైతం ఎటువంటి ప్రకటన లేదు. కనీసం ఈ పథకం అమలుపై విధి విధానాలు, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంపై చదువుకున్న యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో రూ.2,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పిననట్లుగానే 2024లోనూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అదే ధోరణి ప్రదర్శిస్తుండంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం బేషరతుగా చదువుకున్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని యువతీ యువకులు డిమాండ్ చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోచింగ్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి చదువుకుంటున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతి అండగా నిలుస్తుందని గంపెడాశలు పెట్టుకున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే ఎక్కువ శాతం డిగ్రీ, పీజీ చేసిన యువత గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలలో స్టడీ సెంటర్లలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రమాణ స్వీకారం రోజున మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి, ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహించకుండా కోచింగ్ సెంటర్లలో మగ్గుతున్న యువతకు చుక్కలు చూపుతున్నారు. ఈ తొలి సంతకాన్ని నమ్మి అభ్యర్థులు, కనిగిరి, గుంటూరు, హైదరాబాద్ తదితర కోచింగ్ సెంటర్లలో నెలల తరబడి కోచింగ్ తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం టెట్‌తో సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు.

మోసం చేయడం బాబుకు అలవాటే



నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. ఇదే హామీలు 2014లో కూడా ఇవ్వడం జరిగింది. ఏనాడూ చెప్పిన హామీలను నెరవేర్చిన పాపానపోలేదు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోకుండా ఉద్యోగాలు వచ్చే వరకైనా నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– బొల్లా బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు

ఇంటికో ఉద్యోగం కల్పించాలి



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఇంటికో ఉద్యోగం కల్పించాలి. దీనికి సంబంధించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి మంజూరు చేయాలి. నిరుద్యోగ భృతి విడుదల చేస్తే ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లకు వెళ్లడానికి పేద కుటుంబాలకు అనుకూలంగా ఉంటుంది.

– దాకాల పుల్లయ్య, రైతు సంఘం నియోజకవర్గ కన్వీనర్

నిరుద్యోగ భృతి విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. భృతి ఇస్తే ఉద్యోగం వచ్చేంతవరకు ఉపయోగకరంగా ఉంటుంది. మేనిఫెస్టోలో ప్రకటించినట్లు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించాలి. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

– కె.సుధీర్, ఎంఏ, బీఈడీ, కంభం

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



నేను డిగ్రీ పూర్తి చేశా. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నా. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటుతున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. కనీసం ఇస్తారో లేదో చెప్పడం లేదు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసం. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి.

– ఎం.రాజు, అర్ధవీడు

క్లుప్తంగా

నేడు వెలుగొండలో వస్తు విక్రయ వేలం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే వెలుగొండస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడం, అలాగే బ్రహ్మోత్సవాల ముందు రోజు నుంచి వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల ముందు వరకు తలనీలాలు పోగుచేసుకునే హక్కుకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో హక్కులు పొందిన వారు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేశారు. వివరాలకు 80999 49996ను సంప్రదించాలని ఈఓ తెలిపారు.

పారిశుధ్య పనుల్లో జాప్యం తగదు



చినారికట్లలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

కొనకనమిట్ల: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంలో జాప్యం చేయవద్దని డీఎల్‌పీఓ ఎస్‌వీఎల్.హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం చినారికట్ల జంక్షన్ వద్ద పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలను పూర్తి వినియోగంలోకి తెచ్చి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

రాచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మాజీ సర్పంచ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని లక్ష్మీదేవి గుడి వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. జేపీ చెరువు గ్రామానికి చెందిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి మాజీ చైర్మన్, జేపీ చెరువు మాజీ సర్పంచ్ కన్నసాని ఓబులేసు ఉదయం తన మోటరు సైకిల్‌పై చినగానిపల్లె గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో చినగానిపల్లె నుంచి జేపీ చెరువు వైపు మరో బైక్ వస్తోంది. ఈ రెండు బైకులు బలంగా ఢీకొనడంతో మాజీ సర్పంచ్ కన్నసాని ఓబులేసు కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి ఓబులేసు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో గిద్దలూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

భవిత కేంద్రంలో తనిఖీ



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పొదిలి: స్థానిక భవిత కేంద్రాన్ని జిల్లా అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో రికార్డులను జిల్లా సమగ్ర సహిత విద్యా సమన్వయకర్త పి.నాగేంద్ర నాయక్, సీఎంఓ సోనీ రూత్ పరిశీలించారు. కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కేంద్రంలో ఫిజియోథెరపీ, ఇతర సేవలను పిల్లలు సక్రమంగా వినియోగించుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీడీపీఓ సుధామారుతి, ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సుభాషిణి, రిసోర్స్ పర్సన్లు ఎస్‌కే షాహిదాబేగం, బి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మోటారు వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు

మార్కాపురం: ఆటో కార్మికులు, మోటారు వర్కర్ల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆటో కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్లపై సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం కింద ఏటా రూ.15 వేలు ఇవ్వాలని, కార్మికులకు నష్టం కలిగించే జీఓ నెం 21, 31ను రద్దు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు అందె నాసరయ్య, జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశీం కోరారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే మార్కాపురం చెరువుకట్టపై ఉన్న రోడ్డు గుంతలమయంగా మారిందని, ఈ గుంతలను పూడ్చాలని అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే టూవీలర్లు, ఆటోలు, కార్లు, బస్సుల స్పేర్ పార్టులు తరచూ దెబ్బతింటున్నాయని, ప్రయాణికులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరి వెంకటరెడ్డి, రాముడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రావిపాడులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ



మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవి

మార్కాపురం: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మార్కాపురం ఐసీడీఎస్ సీడీపీఓ సుశీలాదేవి పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో ఉన్న ఐసీడీఎస్ కేంద్రాల్లో మహిళలు, గర్భిణులు, బాలింతలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. మహిళలు ప్రతి రోజూ పాలు, గుడ్డు, ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో వండిన ఆహారం తినడం వల్ల సంపూర్ణ పోషకాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవికుమారి, కోమలి, బుజ్జి, కమల తదితరులు పాల్గొన్నారు.

కంభం: సంపూర్ణ ఆరోగ్యంతో అన్ని సమస్యలను పరిష్కరించుకోవచ్చని సీడీపీ నీలోఫర్ పేర్కొన్నారు. మండలంలోని రావిపాడు గ్రామంలో మంగళవారం పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పోషకాహార పదార్థాల నమూనాలను ప్రదర్శించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలన, బాలికా సంరక్షణ, బాలిక విద్యపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తర్లుపాడు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోషకాహారంపై ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయోడిన్, ఐరన్ లోపం, సమతుల ఆహారం గురించి విద్యార్థులకు వివరించారు.

పోషకాహార పదార్థాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం సుధాకర్, బయాలజీ ఉపాధ్యాయుడు బ్రహ్మానందం, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు వృథా



బోరు నుంచి వృథాగా పోతున్న నీరు

రాచర్ల: వేసవి కాలంలో ఎండలు మండిపోతుండటంతో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. భూగర్భ జలాలు అడుగంటడంతో పలుచోట్ల బోరుబావులు ఒట్టిపోయి తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని నీటి వృథాను అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రాచర్ల మండలంలోని చోళ్లవీడులో పశువైద్యశాలకు వెళ్లేదారిలో సింగిల్ ఫేజ్ మోటారు వద్ద తాగు నీరు గంటల తరబడి వృథాగా పోతున్నాయి. మినీవాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి సింగిల్ ఫేజ్ మోటారుకు అనుసంధానిస్తే నీటి వృథాను అరికట్టవచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మిర్చిలో సస్యరక్షణ చర్యలు పాటించండి

మార్కాపురం: మిర్చి సాగుచేసిన రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మార్కాపురం వ్యవసాయశాఖాధికారి డి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం వేములకోట, కొట్టాలపల్లి, వేములపేట తదితర గ్రామాల్లో మిర్చి తోటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో గ్రామ సభలో మాట్లాడారు. రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని చెప్పారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కళ్యాణం



స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత అమలక లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో 62వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారాయణస్వామి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు మంగళవారం వైభవోపేతంగా నిర్వహించారు. త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో వేదపండితులు కిశోర్, అర్చక బృందం స్వామి వారి కళ్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు డీవీ కృష్ణారెడ్డి, జి.వెంకటరెడ్డి, వై.సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, యోగిరెడ్డి, మహిళా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

పశ్చిమ ప్రకాశాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి



రైతులతో మాట్లాడుతున్న గాలి వెంకట రామిరెడ్డి

తర్లుపాడు: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు తదితర మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, ప్రభుత్వం వెంటనే పశ్చిమ ప్రకాశాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను, ప్రజలను ఆదుకోవాలని పశ్చిమ ప్రకాశం రైతు సంఘ అధ్యక్షులు గాలి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆయా మండలాల్లోని పలు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. బోర్లు ఎండిపోయాయని, నీళ్లందక పంటలు కూడా ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కరువు కింద ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేలు అందించి, రుణాలు మాఫీ చేయాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రైతులు లక్ష్మయ్య, నడిపి అల్లూరయ్య, కాశయ్య, మక్బుల్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొనకనమిట్ల: విద్యతోనే ఉజ్వల ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవి విగ్రహానికి పూజలు చేశారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల ఉపాధ్యాయుడు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి ప్రదర్శించిన మయసభ నాటకంలోని దుర్యోధుని ఏకపాత్రాభినయం ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని 9 గ్రామ సచివాలయాల పరిధిలో గల బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ శోభన్‌బాబు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలకు 90 రోజులపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు శిక్షణ కేంద్రం, ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయంలో సంప్రదించి యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పీవీ పురం సర్పంచ్ ఐపీ దాఖలు

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురం సర్పంచ్, టీడీపీ నేత మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపీ దాఖలు చేశారు. ఈ మేరకు అండర్ సెక్షన్ 19(2) ఆఫ్ ది ప్రొవిన్షియల్ ఇన్‌సాల్వెన్సీ యాక్ట్ ప్రకారం ఏడుగురికి కోర్టు నుంచి ఇన్‌సాల్వెన్సీ నోటీసులు పంపారు.

రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలి



బేస్తవారిపేట మండలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ, హెచ్ఓ

బేస్తవారిపేట: పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ అన్నారు. మండలంలోని పీవీ పురం, అక్కపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఉద్యానవనశాఖ అధికారిణి డీ శ్వేత మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీపై ఉద్యాన యాంత్రీకరణ పథకంలో లక్ష రూపాయలలోపు పరికరాలు అందిస్తారన్నారు. పండ్ల తోటలు, హైబ్రిడ్ కూరగాయలు నాటుకున్న రైతులకు రాయితీ ఇస్తారన్నారు. వ్యక్తిగత నీటి కుంటలు, ప్యాక్ హౌస్‌లు 50 శాతం సబ్సిడీపై మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కలిగి ఉండాలి

గిద్దలూరు రూరల్: రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బాలాజీనాయక్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ మహబూబ్‌బాష పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులనే వాడాలి

రాచర్ల: సేంద్రియ ఎరువులు వాడటం వల్ల నేలలో భూసారం పెరిగి పంట దిగుబడి బాగుంటుందని ఏఓ షేక్.అబ్దుల్ రఫీక్ అన్నారు. మండలంలోని చినగానిపల్లెలో రైతులకు భూసారం పెంపుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు.

మద్దతు ధరకు అమ్ముకోండి

తర్లుపాడు: కంది సాగుచేసిన రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7500 కు అమ్ముకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పోతలపాడు, కందళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. మార్క్‌ఫెడ్ ద్వారా వచ్చే వారం నుంచి కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు వివరించారు. తక్కువ ధరకు బయట మార్కెట్‌లో అమ్ముకొని రైతులు నష్టపోవద్దని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల ఆధ్వర్యంలో రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఎస్ సౌజన్య, సిబ్బంది రాధ, శ్వేత, మునికాశయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ వెంకటేశ్వర్లు